డిసిసి కార్యదర్శిగా నాగరాణి

ప్రజాశక్తి - కడప

జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా పైడికాల్వ నాగరాణిని నియమిస్తూ ఉత్తర్వులు అందాయి. ఆమెకు నియామక పత్రాన్ని బుధవారం పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీని 2024లో జరగబోవు ఎన్నికల్లో గెలిపించి రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిగా చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నాగరాణికి నియామక పత్రం అందజేస్తున్న తులసిరెడ్డి

కబడ్డీ ఆడుతూ అంగన్వాడీల నిరసన

- కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు
- షోకాజ్ నోటీసులకు అర్బన్ సిడిపిఒకు సమాధాన పత్రాలు అందజేత
- కళ్లు, చెవులు, నోరు మూసుకుని, వంటా వార్పుతో నిరసన
- 37వ రోజు కొనసాగిన అంగన్వాడీల సమ్మె

జమ్మలమడుగు : కబడ్డీ ఆడుతూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - కడప

సమస్యలు తక్షణం పరిష్కరించండి సమ్మెను విరమింపజేస్తాం షోకాజ్ నోటీసుకు సమాధానం ఇస్తున్నాం అని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీదేవి అన్నారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీలు చేస్తున్న సమ్మె బుధవారం నాటికి 37వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అక్కడి నుండి ర్యాలీగా కడప అర్బన్ సిడిపిఒ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ప్రభుత్వమిచ్చిన షోకాజ్‌కు తీసుకు సమాధానంగా అంగన్వాడీలు, యూనియన్ నాయకులు అర్బన్ సిడిపిఒకు పత్రాలు అందజేశారు. సిడిపిఒ కార్యాలయం ఆవరణలో బయటాయించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఎలాంటి బెదిరింపులకు భయపడేది లేదని, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేంతవరకు తమ పోరాటం ఆగదని లక్ష్మీదేవి హెచ్చరించారు. ప్రభుత్వం నోటీసులోని 11వ పాయింట్ ప్రకారం మా యూనియన్ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ద్వారా సమ్మె నోటీసు ఇచ్చి సమ్మెలో పాల్గొన్నామని పేర్కొన్నారు. గత ఏడాది డిసెంబర్ 12వ తేదీ నుండి సమ్మెలో పాల్గొంటున్నామన్నారు. ప్రభుత్వం 2024 జనవరి 6వ తేదీ నుండి కక్షకట్టి అణచివేయాలనే దురుద్దేశంతో జిఒనెం.2 ద్వారా సమ్మెను నిషేధించిందన్నారు. ప్రభుత్వం జీతం పెంచి త్వరగా సమ్మెను పరిష్కరించాలని కోరుతున్నామని సమాధాన పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. ఎస్మాను ప్రభుత్వం దుర్వినియోగం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డిఎం.ఓబులేసు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూని యన్ నాయకులు ఎంపీ అంజనీదేవి, వినీల, పోలమ్మ, వెంగమాంబ, శాంతి, సావిత్రి, నాగలక్ష్మి, పద్మ, గంగోజి, లక్ష్మి, సిఐటియు నాయకులు ఉదయ్, పవన్, గిరి పాల్గొన్నారు. **చాపాడు :** తహశీల్దార్ కార్యాలయం వద్ద తమ నిరసనను తెలియజేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ నాయకులు సుజాత మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీల పట్ల చిన్నచూపు చూస్తుం దన్నారు. న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సామరస్యంగా నిరసన తెలియజేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకుండా బెదిరింపులకు దిగుతోందన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **జమ్మలమడుగు :** అంగన్వాడీల సమ్మెను నీరు గాడ్చాలని సంకల్పంతో అంగన్వాడీలకు నోటీసులు ఇస్తూ భయాందోళనకు గురి చేస్తుందని తాము నోటీసులకు భయపడి అంగన్వాడి సమ్మెను విరమించే ప్రసక్తి లేదని యూనియన్ నాయకులు భాగ్యమ్మ, లక్ష్మీదేవి పేర్కొన్నారు. ఐసిడిఎస్ కార్యాలయం ఎదురుగా అంగన్వాడీలు కబడ్డీ పోటీలు నిర్వహించి తమ నిరసనను తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్, కులాయమ్మ, అంగన్వాడీలు పాల్గొన్నారు. **ముద్దనూరు :** ప్రభుత్వం డిమాండ్లను పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగిస్తామని అంగన్‌వాడీలు పేర్కొన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం సమ్మెను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీలకు జారీ చేసిన షోకాజ్ నోటీసులకు సమాధానంగా ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సిడిపిఒ ముంతాజ్ బేగంకు సమాధాన పత్రం అందజేశారు. **మైదుకూరు:** అంగన్వాడీల డిమాండ్ల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న సమ్మెలో మైదుకూరులో కళ్ళు, చెవులు నోరు, మూసుకొని విన్నూత్నంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు జి.శివకుమార్, శ్రీరాములు మాట్లాడుతూ మహాత్మా గాంధీ చెడు వినవద్దు, చెడు మాట్లాడవద్దు, చెడు చూడవద్దు అని సూక్తులు చెప్పాడని నేటి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అంగన్వాడీలు 37 రోజులుగా సమ్మె చేస్తుంటే కళ్ళతోచూడటం లేదని వారి డిమాండ్లను చేవులుండి వినటం లేదని, వారి సమస్యలను పరిష్కరిస్తామని నోటితో చెప్పడం లేదని అందుకు నిరసంగానే నేడు కళ్ళు, చెవులు, నోరు మూసుకొని నిరసన కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన సమ్మె నోటీస్‌కు సమాధానంగా ఐసిడిసి ప్రాజెక్ట్ అధికారికి రాతపూర్వకంగా సమాధానం ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వై.అజయ్ కుమార్, యూనియన్ నాయకులు చెన్నమ్మ, అంజనాదేవి, ధనలక్ష్మి, భారతి, లక్ష్మి, అనురాధ, ప్రవల్లిక, ప్రభావతి శ్యామల, రమాదేవి, రామ తులసి, రిజ్వానా, అన్నపూర్ణ, లత, శ్రీదేవి పాల్గొన్నారు. **బద్వేలు :** స్థానిక సమగ్ర శిశు అభివృద్ధి అధికారి కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసులకు సమాధానమిస్తూ లేఖలు రాశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, పట్టణ నాయకులు రాజగోపాల్, డివైఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షులు ఆదిల్, ఐద్వా మహిళా సంఘం పట్టణ అధ్యక్షులు గంపా అనంతమ్మ, నాయకులు బాలమ్మ, నాగమ్మ, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు గౌరవాధ్యక్షులు కె.సుభాషిని, ప్రధాన కార్యదర్శి ఆర్.హుసేనమ్మ, ప్రాజెక్టు నాయకులు రాధమ్మ, గౌరీ, రత్న, జయప్రద, సత్యవతి, విజయమ్మ, కళావతి, ఉమాదేవి, మహాలక్ష్మి పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** జగన్ ముఖ్యమంత్రి పీఠం ఎక్కేందుకు ఓట్లేసి గెలిపించిన అంగన్వాడీల పట్ల మోసపూరిత మాటలు మాట్లాడడం తగదని ఇలాంటి మాటలు మానుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. స్థానిక శివాలయం సర్కిల్‌లో వంటావార్పు కార్యక్రమంతో నిరసన వ్యక్తం చేశారు. ప్రముఖ నాయకులు కొవ్వూరు బాలచంద్రారెడ్డి అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలియజేశారు. ఆయన స్వయంగా వంట వండారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి సుబ్బలక్ష్మి, సునీత, పద్మ, కృష్ణవేణి, లక్ష్మిదేవి, రాజి, విజయ, గురుదేవి, శివమ్మ, అంగన్వాడీలు, ఆయాలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : వంటావార్పుతో అంగన్వాడీల నిరసన

కడప : షోకాజ్ నోటీసుకు సమాధానంగా సిడిపిఒకు పత్రాలు అందజేస్తున్న అంగన్వాడీలు

బద్వేలు : నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

'సమాజ సేవకు పాటుపడాలి'

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

పూర్వ విద్యార్థుల కలయిక ప్రశంసనీయమని, ఇలాంటి కార్యక్రమాలు స్నేహభావం, ఐకమత్యం పెంపొందిస్తుందని, ప్రయోజకులైన ప్రతి ఒక్కరూ సమాజ సేవకు పాటుపడాలని, మీతో పాటు విద్యనభ్యసించి అకాల మరణం చెందిన కుటుంబాలకు తోడుగా ఉండి భరోసా అందించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989-90 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో బుధవారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 34 ఏళ్ల తర్వాత కలిసిన నాటి విద్యార్థులు, నేటి మిత్రులు ఒకరినొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను నాటి విద్యార్థులు దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి 1980-81 బ్యాచ్ పూర్వ విద్యార్థి డిఎస్‌పి లక్ష్మీ నారాయణ, స్థానిక సిఐ పురుషోత్తమరాజు, ఉపాధ్యాయులు కుల్లాయిరెడ్డి, నాగామునిరెడ్డి, నారాయణరెడ్డి, వెంకటరెడ్డి, బాలమ్మ, రాజారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ భారతి పాల్గొని విలువైన సందేశాన్ని అందించారు. హాజరైన వారికి నుతనోత్సాహం అందించేలా పాటలు, నృత్యాలను నిర్వాహకులు ఏర్పాటు చేసి ఆకట్టుకున్నారు. పాల్గొన్న వారికి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో గెట్ టుగెదర్ కోర్ కమిటీ సభ్యులు స్పెషల్ క్లాస్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ ఎస్‌వి.రమణ, ఎపిఐఆర్‌సి ప్రాజెక్ట్ డైరెక్టర్ మోదుగుల లక్ష్మీనరసయ్య, ఎన్‌హెచ్‌ఎఐ 45 సివిల్ ఇంజినీర్ అరెం భాస్కర్ రెడ్డి, సీనియర్ పాత్రికేయులు ఎస్వీ రమణ, జైన్ డ్రిప్ ఇరిగేషన్ ఏజెన్సీ డీలర్ జ్యోతి సుబ్బారెడ్డి, పి.చెంగమ్మ, కె.వెంకట సుబ్బమ్మ, మామిడి బాబు కత్తి చంద్రతో పాటు 40 మంది క్లాస్ మేట్స్ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

చంద్రబాబు సభను జయప్రదం చేయండి

- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

జగన్ అధికారంలోకి వచ్చి, పాలనరాహిత్యంతో అన్ని రంగాలను నిర్వీర్యం చేశారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ద్వారకా నగర్‌లోని ఆయన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ జిల్లా పర్యటనల్లో చేసిన అభివృద్ధి శిలాఫల కాలకే పరిమితి అయిందన్నారు. ఉక్కు పరిశ్రమ పూర్తి చేసి, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తామన్నట్లు, ఆరాటంగా రెండుసార్లు పరిశ్రమకు శంకుస్థాపనలు చేసి, పనులు చేయక నిరుద్యోగులను మోసం చేశారని చెప్పారు. అధికారం కోసం జగన్ ఆచరణకు అమలు కానీ హామీలు, ఇచ్చి నెరవేర్చలేదన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం దిశగా ఆలోచించని వ్యక్తి జగన్ అని విమర్శించారు. డబ్బు, మద్యం, మట్టి మాఫియా కార్యకలాపాల పాలన సాగించిన ఘనత జగన్ ది అని నిప్పులు చెరిగారు. చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకు నేందుకు ప్రజలు ఎన్నికల కోసం వేచి ఉన్నారని, జిల్లాలో అన్ని స్థానాలు టిడిపి కైవసం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రేపు కమలాపురంలో టిడిపి అధినేత చంద్రబాబు నిర్వహిస్తున్న రా, కదలిరా బహిరంగ సభను జయప్రదం చేయాలని, పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. కడప నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి రెడ్డప్పగారి మాధవి మాట్లాడుతూ సంక్షేమ పథకాలను రకరకాల కారణాలు చూపి, తొలగించి లబ్ధిదారులను ఈ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. జగన్ పాలనతో నిర్వీర్యం అయిన రాష్ట్ర పరిస్థితిని, ప్రజలకు వివరించే అందుకే రా, కదలిరా పిలిపిచ్చారని ఆమె చెప్పారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, సుధాకర్ యాదవ్, కాసిం పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

శ్రీకృష్ణదేవరాయలు గొప్ప పరిపాలనాధ్యక్షుడు

- ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా

ప్రజాశక్తి-కడప

శ్రీకృష్ణదేవరాయలు గొప్ప పరిపాలనాధ్యక్షుడని ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా కొనియాడారు.బుధవారం స్థానిక నగరంలోని శ్రీకృష్ణదేవరాయ సర్కిల్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఆయన కాంస్య విగ్రహం వద్ద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి అంజాద్‌బాషా పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయల 533వ జయంతిని పురస్కరించుకొని ఆయనకు ఘన నివాళర్పించామన్నారు. దక్షిణ భారతదేశ చరిత్రలో మధ్యయుగ రాజుల్లో శ్రీకృష్ణదేవరాయలు మహా కీర్తిశాలని పేర్కొన్నారు. ఆయన పరిపాలనలో పేద బడుగు బలహీన వర్గాల వారికి పూర్తిస్థాయిలో న్యాయం చేస్తూ మంచి పరిపాలకుడిగా పేరు తెచ్చుకున్నారన్నారు. అలాంటి రాజనీతిజ్ఞుడు, సాహితీ సమారంగణ సార్వభౌముడు తెలుగు భాష కోసం పాటుపడటం మనకెంతో గర్వకారణమన్నారు. శ్రీకృష్ణదేవరాయలు అనేక రకాలుగా ప్రజలకు సేవలంచింది ఆదర్శంగా నిలిచిన ధీరుడన్నారు. తెలుగు ఖ్యాతిని దేశ వ్యాప్తంగా కాకుండా ప్రపంచ వ్యాప్తంగా కూడా వ్యాపింప చేసిన ఉన్నతమైన వ్యక్తిని పేర్కొన్నారు. దేశభాషలందు తెలుగు లెస్స అని చాటి చెప్పిన మహానుభావుడన్నారు. రాయలసీమను రతనాల సీమగా మార్చిన తెలుగు ప్రజల గుండెల్లో శాశ్వత స్థానం సంపాదించారన్నారు. ఆయన పరిపాలనలో ప్రజలందరూ సుఖశాంతులతో మెలిగారన్నారు. శ్రీకృష్ణదేవరాయల సేవలను స్మరించుకుంటూ మనమంతా ఆయన అడుగుజాడల్లో నడవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, కడప డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, సోషల్ వెల్ఫేర్ చైర్మన్ పులి సునీల్ కుమార్, గిడ్డంగుల చైర్మన్ కరిముల్లా, ప్రముఖ నాయకులు దుర్గాప్రసాద్, అమరప్ప, నారాయణస్వామి,రాము, సత్య, తోట కృష్ణ, దాసరి శివ, పత్తి రాజేశ్వరి, శివ కేశవ, బండి బాబు, రామకృష్ణ, సుబ్బయ్య, వెంకటేశ్వర్లు, తేజ, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ మెంబర్లు, నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. **కడప అర్బన్ :** శ్రీకృష్ణదేవరాయలుని ప్రస్తుత పాలక వర్గాలు ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్సీ రామచంద్రయ్య, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి హరి ప్రసాద్ పిలుపునిచ్చారు. కళాక్షేత్రంలో శ్రీకృష్ణదేవరాయల 533 జయంతి వేడుకలు నిర్వహించారు. ఏళ్ల నుంచి ఆయన పాలన ఇంకా ప్రజల్లో గుర్తుకు ఉండిపోయిందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక వేత్తలు అమరప్ప, దుర్గాప్రసాద్, జనసేన ఉమ్మడి జిల్లాల ఇన్‌ఛార్జి సుంకర శ్రీనివాస్, బలిజ సంఘ నాయకులు నాగరాజు, సమతం రాము, బండారు సత్యనారాయణ, బండి బాబు, సమతం రాము, వైసిపి నాయకులు కెఎస్సార్ వేణు, బాస్ జిల్లా అధ్యక్షులు దాసరి శివ, డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండయ్య, ఎంప్లాయిస్ యూనియన్ మస్తాన్ పాల్గొన్నారు **పులివెందుల రూరల్:** శ్రీకృష్ణదేవరాయలు ఎంతో మహోన్నతమైన వ్యక్తిని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిపేర్కొన్నారు. శ్రీకృష్ణదేవరాయల జయంతి సందర్భంగా బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు ప్రసాద్ ఆధ్వర్యంలో బలిజ సంఘాలతో కలిసి ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బలిజ సంఘీయులు వెంకటసుబ్బయ్య, ఆంజనేయులు, వీర, కడియాల లక్ష్మీనారాయణ, జగన్నాథుడు, తోటంశెట్టి హరికృష్ణ రాయల్, జయ, సాయి పాల్గొన్నారు. **పులివెందుల టౌన్ :** ఆంధ్రప్రదేశ్లో మరో మూడు నెలల్లో శ్రీకృష్ణదేవరాయల పాలన రాబోతుందని మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. పట్టణములోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కడప : శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి నివాళులర్పిస్తున్న అంజాద్‌బాషా

పరిశ్రమల్లో భద్రతా చర్యలు పటిష్టం : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్ రామరాజు

ప్రజాశక్తి - కడప

పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా క్రైసిస్ గ్రూప్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో కార్మికులకు రక్షణ కల్పించేందుకు పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల లోపలే కాకుండా పరిశ్రమల చుట్టుపక్కల ఉన్న ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మరింత భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఆన్ సైట్ కాకుండా ఆఫ్ సైట్‌లో అలారం సిస్టం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయి కమిటీలో పరిశ్రమల శాఖ, కార్మిక శాఖ, ఫ్యాక్టరీస్, కాలుష్య నియంత్రణ మండలి, అగ్నిమాపక శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో భద్రత చర్యలను పర్యవేక్షించాల్సిన అవసరం ఉందనన్నారు. రెడ్ కేటగిరీలో ఉన్న పరిశ్రమల్లో తగిన రక్షణ, భద్రతఎమర్జెన్సీ కల్పించేందుకు, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన స్టాండర్డ్ ఆపరేషన్ ప్రోటోకాల్ చర్యలను ఖచ్చితంగా పాటించాలన్నారు. చిన్న పాటి నిర్లక్ష్యం కూడ పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుందని, ఆయా కంపెనీల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెవెన్యూ, ఫైర్ శాఖల అధికారులు సమన్వయంతో తరచుగా మాక్ డ్రిల్ కార్యక్రమాలు నిర్వహిస్తూ కార్మికుల్లో, ప్రజల్లో ఫ్యాక్టరీలలో ప్రమాదాల నివారణ, ప్రమాదాల సమయంలో చేపట్టాల్సిన అత్యవసర చర్యలపై అవగాహన పెంపొందించాలన్నారు. 15 రోజులకు ఒకసారి పరిశ్రమల్లో తనిఖీలను చేసి నివేదికను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎఎస్‌పి తుషార్ డూడి, డిఆర్ఒ గంగా ధర్ గౌడ్, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి, డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు, పిసిబి, విద్యుత్, ఆర్‌టిపిపి, ఫైర్ అధికారులు పాల్గొన్నారు.

పథకాల పట్ల అవగాహన అవసరం

ప్రజాశక్తి-కడప

కార్మికులు ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన కలిగి ఉండాలని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు సూచించారు. సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రెటరీ బాబా ఫక్రుద్దీన్ ఆదేశాల మేరకు బుధవారం కడప నగరంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని చైతన్య కెమికల్స్‌లో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులచే న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాదులు మాట్లాడుతూ కార్మికులు ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన కలిగి ఉండాలి, పనిచేసే చోట తప్పనిసరిగా ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కలిగించేలా యాజమాన్యం చూసుకోవాలి అన్న విషయాలను వివరించారు. లీగల్ ఎయిడ్ క్లినిక్, పారా లీగల్ వాలంటరీల విధివిధానాలు తెలియజేశారు, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డు గురించి వివరించారు, కార్మికులు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలి, కార్మికుల ప్రమాదాలు కాంపెన్సేషన్, ఈ శ్రమ కార్డ్స్, మొదలగు అంశాలను వివరించారు. ఏమైనా సమస్య ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడపను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో శాంత, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎస్.శ్రీనివాస్, పారా లీగల్ వాలంటరీ జె.సురేష్ సహాయం, చైతన్య కెమికల్స్ మేనేజ్మెంట్, కార్మికులు పాల్గొన్నారు.

వైసిపికి ఓట్లేస్తే రాష్ట్రం సర్వనాశనం

- టిడిపి జిల్లా అధ్యక్షులు మల్లెల లింగారెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

ఒక్కసారి ప్రజలు నమ్మి ఓట్లు వేస్తేనే, రాష్ట్రాన్ని వైసిపి ప్రభుత్వం అధోగతి పాలు చేసిందని, మరో మారు ఓట్లు వేస్తే, రాష్ట్రం సర్వనాశనం కావడం ఖాయమని టిడిపి కడప జిల్లా అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి ధ్వజమెత్తారు. టిడిపి జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాగానే దశల వారీగా మద్యనిషేధం అమలు చేస్తానని చెప్పిన జగన్, మద్యాన్ని ఏరులై పారిస్తూ, ధరలు పెంచి విక్రయిస్తూ మద్యం రాయుళ్ల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. మద్యం, విద్యుత్ ఛార్జీల పెంపు రాబడి తోనే ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి చేసుకోవచ్చని చెప్పారు. జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంపై రూ.13 లక్షల కోట్లు అప్పు చేశారని, నీటి ప్రాజెక్టులు పూర్తి చేశారా, అప్పుచేసి అభివృద్ధి పనులు ఏమి చేశారని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇక చేసిన అప్పు ఎలా తీరుస్తారని నిలదీశారు. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు గాలేరు-నగిరి సుజల స్రవంతి ప్రాజెక్టుకు రూ.2500 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. పులివెందులకు నీళ్ల ఇచ్చిన ప్రభుత్వం తెలుగుదేశం పార్టీదేనన్నారు. గోరకల్లుకు రూ.6000 కోట్లు, పులి కనుమకు రూ.294 కోట్లు, అవుకు టన్నెల్‌కు రూ.450 కోట్లు ఖర్చు చేసి పనులు చేపట్టామని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం నీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై గొంతు ఎత్తితే, అరెస్ట్ చేయడం జైలుకు పంపడం, ఈ ప్రభుత్వ నియంత పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. పేరుకే సంక్షేమ పథకాలని, పన్నులపై, పన్నులు వేసి పేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విరిచిన ప్రభుత్వం వైసిపిదేనన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై విరుచుకుపడ్డారు. ఈ నెల 19న కమలాపురంలో చంద్రబాబు నిర్వహించే రా, కదలిరా బహిరంగ సభను జిల్లాలోనే నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీనియర్ నాయకుడు లక్ష్మిరెడ్డి, సుధాకర్ యాదవ్, కాసిం, రామాంజి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం : డిసిసి

ప్రజాశక్తి - కడప

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా వైఎస్ షర్మిల బాధ్యతలు చేపట్టడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వచ్చిందని డిసిసి అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు. నగర అధ్యక్షులు వై.విష్ణుప్రీతంరెడ్డి అన్నారు. 2024లో జరగబోవు ఎన్నికల్లో తప్పకుండా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో విజయం సాధించి అధికారంలోకి వస్తుందని పేర్కొన్నారు. బుధవారం డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చరిత్రలో ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటిసారిగా ఓ మహిళను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమితులవ్వటం చాలా సంతోషకరమైన విషయన్నారు. గతంలో రాజశేఖర్‌రెడ్డి రెండుసార్లు పిసిసి అధ్యక్షులుగా ఉన్నారని, ఇప్పుడు ఆయన కుమార్తె షర్మిల పిసిసి అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టడంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రావడంతో పాటు ఇది ఎంతో శుభ పరిణామని పేర్కొన్నారు. సమావేశంలో పిసిసి రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, పిసిసి డెలిగేట్ పొట్టిపాటి చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు శ్యామలమ్మ, హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు పాలగిరి శివ, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు ఆనంద్, ఎన్‌ఎస్‌యుఐ సుబ్బారెడ్డి పాల్గొన్నారు. **చెన్నూరు :** షర్మిల పిసిసి అధ్యక్షులుగా పదవి బాధ్యతలు చేపట్టడంతో ఎంతో మేలు జరుగుతుందని కమలాపురం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి పొట్టిపాడు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆమె రాకతో పార్టీ బలోపేతమతుందన్నారు.

ముడిమెల లక్ష్మీదేవి మృతి తీరని లోటు

ప్రజాశక్తి - కడప

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఎం.లక్మి దేవి ఆకస్మిక మరణం సేవా రంగానికే తీరని లోటని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనారోగ్యం కారణంగా గత కొన్ని రోజులుగా హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎం.లక్ష్మీదేవి బుధవారం ఉదయం తుది శ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న కేసలి అప్పారావు ఆమె మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. జమ్మలమడుగుకు చెందిన ఎం.లక్ష్మీదేవి జమ్మలమడుగు బార్ అసోసియేషన్ సభ్యురాలిగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కార్యక్రమాలలో ఎన్నోరకాలుగా సేవలు అందించారన్నారు. ఆమె మృతి జమ్మలమడుగు బార్ అసోసియేషన్ లోనే కాకుండా బాలల హక్కుల పరిరక్షణ కమీషన్‌కు వెలితిని నింపిందన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె కుటుంబానికి ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని చైర్మన్ కేసలి అప్పారావు కోరారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు రాజేంద్ర ప్రసాద్, బత్తుల పద్మావతి, ఆదిలక్ష్మి, గోండు సీతారాం ఉన్నారు.

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దేవేంద్రరాజు

గ్రూప్-2 దరఖాస్తు గడువు పొడిగించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

గ్రూప్-2 దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దేవేంద్ర రాజు తెలిపారు. స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థులు సైట్ పనిచేయలేదని, సర్వర్ డౌన్, ఏపిపిఎస్‌సి వెబ్‌సైట్ సరిగా పనిచేయక చాలామంది దరఖాస్తు చేసుకోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గ్రూప్-2 గడువును పొడిగించాలని డివైఎఫ్ఐగా కోరుతున్నామన్నారు. సమావేశంలో సురేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

చాపాడు తహశీల్దార్‌గా భూషణం

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు తహశీల్దార్‌గా వై.భూషణం నియమితులయ్యారు. మూడు నెలల క్రితం చాపాడు తహశీల్దార్‌గా పనిచేస్తున్న సుభానిని కలెక్టర్ ప్రభుత్వానికి సరెండర్ చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుండి డిప్యూటీ తహశీల్దార్ యామిని ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం రాయలసీమ జోన్ పరిధిలో చేపట్టిన సాధారణ బదిలీలలో భాగంగా గుంతకల్లు ఆర్‌డిఒ కార్యాలయంలో పనిచేస్తున్న భూషణం తహశీల్దార్‌గా నియమితులయ్యారు.

'మహర్షి' పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ముద్దనూరు

మండల కేంద్రంలోని మహర్షి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ 2012 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కరస్పాండెంట్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్నేహితులను కలుసుకుని ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఒకరి నొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పూర్వ విద్యార్థులు కలిసి పాఠశాల కరస్పాండెంట్, ప్రధానోపాధ్యాయులు లోకనాథ్‌ను, ఉపాధ్యాయులను పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ జ్ఞాపకంగా పాఠశాలకు సౌండ్ సిస్టమ్ వితరణ చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, నృత్యాలతో అలరించారు.

విద్యార్థులు రాణిస్తే ఉపాధ్యాయులకు గర్వకారణం

చాపాడు : విద్యార్థులు వివిధ రంగాల్లో రాణించినప్పుడే ఉపాధ్యాయులకు గర్వకారణంగా ఉంటుందని పూర్వ ప్రధానోపాధ్యాయులు జయరామిరెడ్డి పేర్కొన్నారు. చాపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో 2008-09 పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి గదిలో చదువుకున్న అంశాలను సమాజంలో ఉపయోగపడే పనులకు ఉపయోగించాలన్నారు. సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం 15 సంవత్సరాల తర్వాత ఒకచోట కలుసుకున్న స్నేహితులతో పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముద్దనూరు ఎస్ఐగా మైనుద్దీన్

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు ఎస్ఐగా మైనుద్దీన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల శాంతి భద్రతలకు భంగం కలిగించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈయన చాపాడు నుండి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ చంద్రమోహన్ కడప తాలూకా పోలీస్ స్టేషన్ బదిలీపై వెళ్లారు.

22న ఓటర్ల తుది జాబితా విడుదల : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఈ నెల 22న ఓటర్ల తుది జాబితా విడుదలవుతుందని ఆర్‌డిఒ జి.శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో ఆయన రాజకీయ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ 2023 డిసెంబర్ 9 వరకు నమోదైన పేర్లతో ఓటర్ల జాబితా ముద్రించి ఈ నెల 22న ఎన్నికల సంఘం విడుదల చేస్తుందన్నారు. డిసెంబర్ 9 తర్వాత నమోదైన ఓట్లన్నీ సప్లిమెంటరీ జాబితాలో వస్తాయన్నారు. ఇక నుంచి తొలగించడానికి అవకాశం ఉండదని, కేవలం ఓటరు నమోదు కోసం మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ గుర్రప్ప, సీనియర్ ఎన్నికల అధికారులు మస్తాన్‌వలి, వివేకానందరెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు జితేంద్ర, చౌడేశ్వర్, మర్రి ప్రకాశం, శంకర్‌రెడ్డి, మేకల ఆంజనేయులు పాల్గొన్నారు.

ఇప్పట్లలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాల నాల్గొవ సంవత్సర ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు 'జాతీయ సేవ పథకం'లో భాగంగా ఈనెల 17 నుండి 23వ తేదీ వరకు లింగాల మండలం ఇప్పట్ల గ్రామంలో ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించనున్నారు. మొదటి రోజులో భాగంగా బుధవారం ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్.ఎస్.బేగ్, ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ అంకాలమ్మ, విశిష్ట అతిథులుగా సచివాలయం సంక్షేమ సహాయకులు సుధీర్, సచివాలయం మహిళా పోలీస్ కవిత, గౌరవఅతిథిగా స్నేహితఅమృతహస్తం సేవాసమితి రాజు పాల్గొన్నారు.

అధికారంలోకి రావడమే కాంగ్రెస్ లక్ష్యం

- పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలోకి రావడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో సానుకూల వాతావరణం ఉందన్నారు. ఇటీవల రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినట్లే.. ఆంధ్రప్రదేశ్‌లో కూడా అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వైనాట్ కాంగ్రెస్ ఇన్ ఎపి అన్న నినాదంతో కాంగ్రెస్ ముందుకు పోతుందని చెప్పారు. రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేన బిజెపి చేతిలో కీలుబొమ్మలని విమర్శించారు. ప్రత్యేకహోదా, ప్రత్యేక ప్యాకేజీ, కడప జిల్లాల్లో స్టీల్‌ప్లాంట్, పోలవరం పూర్తి కావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని తెలిపారు. వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరడంతో కాంగ్రెస్ పార్టీకి అదనపు బలమని తులసిరెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వస్తే రూ.3 లక్షలు వరకు వ్యవసాయ రుణాలు మాఫీ, రూ.500కు వంట గ్యాస్ సిలిండర్ సరఫరా, నిరుపేదలకు నెలకు రూ.6000 ఆర్థికసాయం అమలు చేస్తామన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని ఆయన కోరారు.

మండల కబడ్డీ విజేత చియ్యపాడు టీం

చాపాడు : మండలస్థాయి కబడ్డీ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఎన్.ఓబాయపల్లె, వెదురూరు, మడూరు, చియ్యపాడు టీంలు ఫైనల్ మ్యాచ్‌లో తలపడ్డాయి. చియ్యపాడు టీం ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొంది నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికైంది. ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సుధాకర్, శ్రీనివాసులరెడ్డి, భాగ్యలక్ష్మి, వేణు, ఫిజికల్ డైరెక్టర్లు రాజసింహ, హసీనా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష' విజయవంతం

ఎర్రగుంట్ల : స్థానిక మున్సిపల్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతమైందని మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. క్రాంతి నగర్ సచివాలయానికి చెందిన 4, 5 వార్డుల ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. మున్సిపల్ ఛైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి వైద్య శిబిరం పరిశీలించి ప్రజలకు ఆరోగ్య సురక్ష కిట్లను అందించారు. కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ వైద్యులు శ్రీనాథ్, ఆర్వో గంగిరెడ్డి, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చీనీ రైతుల ఆశలు చిగురించేనా..!

ఆశాజనకంగా సీజన్ కాపు, పూత

ఆశాజనకంగా పూతతో ఉన్న చీనీ చెట్లు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఈ ఏడాది సీజన్ కాపునకు సంబంధించి చీనీ రైతులు నీటి తడులను చెట్లకు అందించారు. ప్రస్తుతం చీనీ చెట్టు ఆశాజనకంగా పూతలు రావడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. గత మూడేళ్ల నుంచి పూతలు వచ్చినప్పటికీ వాతావరణంలో మార్పులు కారణంగా చీనీ గోలికాయ దశలో రాలిపోయి తీవ్రంగా నష్టపోయారు. నియోజవర్గంలో దాదాపు 54 వేల ఎకరాల్లో చీనీ తోటలు సాగులో ఉన్నాయి. తోటల్లో రైతులు చెట్టు ఎండు కొమ్మలను కటింగ్ చేయించి, ఎరువులను వేసి వాడు దశకు వచ్చేలా చర్యలు చేపట్టి నీటి తడులను అందిస్తున్నారు. ఈ ఏడాది వాతావరణంలో చలి తక్కువగా ఉన్నందున పూతలు వచ్చినప్పటికీ ఎండలు అధికమైతే కాయ పిందె దశలోనే రాలిపోయే అవకాశం ఉందని మరో వైపు రైతుల్లో ఆందోళన నెలకొని ఉంది. సకాలంలో నీటి తడులు అందిస్తేనే మంచి దిగుబడులు. రైతులు సకాలంలో తమ తోటలకు నీటి తడులు వస్తేనే మంచి దిగుబడులు వస్తాయని ఉద్యాన శాఖ విస్తరణాధికారి వీరారెడ్డి చెబుతున్నారు. రైతులు నవంబర్ 15 నుంచి డిసెంబర్ 20 తేదీలోపు తమ చెట్లకు వాడు దశను వదిలించి నీటి తడులు అందించాలని అప్పుడే గణనీయమైన దిగుబడులు సాధ్యమవుతుందన్నారు. అంతకు మించి నీటి తడులు అందించినట్లయితే సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టినట్లయితే దిగుబడులు వచ్చే అవకాశం ఉంది.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రైతుల సంక్షేమమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని కడప పార్లమెంట్ సభ్యులు వైయస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. పులివెందులలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో రూ.కోటి 20 లక్షలతో నిర్మించిన రైతు బజార్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా జగనన్న ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోలేని విధంగా ఎపిలో రైతుల సంక్షేమం కోసం జగనన్న ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో పంట నమోదులో ఇ క్రాప్ విధానాన్ని తెచ్చిన ఘనత జగన్‌రెడ్డిదే అన్నారు. పంట నమోదులో రైతులు తమ పొలాల్లో ఏ పంట సాగు చేశారో.. ఇ క్రాప్‌లో వ్యవసాయ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారన్నారు. దీనివల్ల ప్రభుత్వమే ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లిస్తుందన్నారు. తద్వారా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వంతోపాటు, ఇన్సూరెన్స్ కంపెనీలు నష్టపరిహారం చెల్లిస్తున్నాయన్నారు. రాయలసీమ జిల్లాల్లో రైతులు ఉద్యాన పంటలైన అరటి, బత్తాయి, నిమ్మ, బొప్పాయి పంటలను ఎక్కువగా సాగు చేస్తున్నారని తెలిపారు. పంటల సాగుకనుగునంగా రాష్ట్ర ప్రభుత్వమే ధరలను నిర్ణయించి కొనుగోలు చేయడం దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రథమమన్నారు. ముఖ్యంగా బత్తాయి రైతులకు సూటు లేకుండా మార్కెట్‌లో కొనుగోలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పురపాలక ఇన్‌ఛార్జి వైస్ మనోహర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ చిన్నప్ప, పురపాలక ఛైర్మన్ వరప్రసాద్, ఎపి పౌరసరఫరాల శాఖ గంగాధర్‌రెడ్డి, కౌన్సిలర్ కిషోర్, కో ఆప్షన్ నెంబర్ చంద్రమౌళి, కౌన్సిలర్ డేనియల్ బాబు, వైసిపి సీనియర్ నాయకులు బలరామిరెడ్డి, పుష్పానాథ్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ సర్వోత్తమరెడ్డి, డైరెక్టర్ మార్కెట్ యార్డ్ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

రైతుబజార్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ, ఛైర్మన్లు, నాయకులు

రూ.కోట్లు విలువైన విద్యుత్ సామగ్రి అపహరణ

నిమ్మకు నీరెత్తినట్లుగా విద్యుత్ శాఖ - కొందరిని తప్పించాలని పోలీసు శాఖపై ఒత్తిళ్లు

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలోని తాళ్లప్రొద్దుటూరు 33/11కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గండికోట ప్రాజెక్టులో ముంపునకు గురైన తాళ్లప్రొద్దుటూరు, దత్తాపురం, బుక్కపట్నం, దొరువు, బొమ్మేపల్లి, చామలూరు, యర్రగుడి గ్రామాల రైతుల అభివృద్ధికి ప్రభుత్వం సబ్సిడీ రూపంలో.. రైతు వాటాతో పాటు ప్రభుత్వం వాటా కలిపి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారు. ఇందులో రైతుకు పూర్తి హక్కులు ఉండవు. రైతులు తమ అవసరాలకు విద్యుత్ ఉపయోగించుకొనువరకే హక్కు ఉంటుంది. పూర్తి హక్కు విద్యుత్ శాఖకు ఉంటుంది. ఇక్కడ దాదాపుగా రూ.4నుండి రూ.5 కోట్ల ఖర్చుతో విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఆయా గ్రామాలకు గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్, పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లు, అల్యూమినియం కండక్టరు, ఇనుప సామగ్రి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో (తొలగించి డిపార్ట్మెంట్‌కు స్వాధీనం చేయకపోవడం వల్ల) గండికోట ప్రాజెక్టు నీటిలో ముంపునకు గురైంది. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గడంతో అయా గ్రామాలకు గతంలో ఏర్పాటు చేసిన మొత్తం విద్యుత్ సామగ్రి పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లు, అల్యూమినియం కండక్టరు, ఇనుప సామగ్రిని దాదాపుగా (రెండు కోట్లు విలువ చేసే) పరిసర గ్రామాలకు చెందిన కొందరు 30 నుండి 40మంది అక్రమార్కులు ముఠాలుగా ఏర్పడి దొంగిలించినట్లు ఆరోపణలున్నాయి. ఆ సామగ్రిని పాత ఇనుప వస్తువులు కొనుగోలు చేసే కొందరు స్థానిక వ్యాపారులకు అమ్మినట్లు తెలుస్తోంది. దీనివల్ల లక్షల రూపాయలు ఆర్జించినట్లు స్థానికులు చెప్పుకుంటున్నారు. ఈ దొంగతనం చేసిన వారిలోని కొందరిని ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారి స్తున్నారు. ఈ దొంగతనంపై విద్యుత్ అధికా రులు ఇప్పటి వరకు కేసులు పెట్టకపోవడంతో ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ వారి హస్తం కూడా ఉం టుందనే అనుమానాలు లేకపోలేదు. విద్యుత్ సామగ్రి అపహరణపై ఇప్పటి వరకు ఆ శాఖా ధికారులు ఎలాంటి కేసులు పెట్టక పోవడంతో అనుమానాలకు తావిస్తోంది. విద్యుత్ శాఖా ధికారులు బాధ్యతగా వీటిని తొలగించి సంబంధిత శాఖకు స్వాధీనం చేసి ఉంటే ప్రభుత్వానికి రూ. 4నుంచి రూ.5 కోట్లు ఆదా అయ్యేదని పలు వురు పేర్కొం టున్నారు. ఈ కేసుకు సంబంధించి కొందరు దొంగలను బయట పడేసేందుకు పలువురు టిడిపి, వైసిపి నాయకులు పోలీసులపై వత్తిడి తెస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. దొంగను రాజకీయ నాయకులు కాపాడితే సామాన్య ప్రజలకు న్యాయం ఎలా జరుగుతుందని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వ ఆస్తులకు రక్షణ లేకపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. రూ.కోట్ల దొంగతనం కేసులో పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

చంద్రబాబు శేషజీవితం జైల్లోనే : 'రాచమల్లు'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు స్కిల్ కేసులో తన శేషజీవితాన్ని జైల్లోనే గడపాల్సి వస్తుందని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 17ఏ పై న్యాయమూర్తులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారని, బాబుపై పెట్టిన కేసులో చట్టబద్ధత ఉందని, ఈ కేసులో సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. ఈ కేసులో సాక్షాధారాలు బలంగా ఉన్నందునే సుప్రీం కోర్టు జోక్యం చేసుకోలేదని తెలిపారు. 2024 ఎన్నికలకు ఫిబ్రవరి మూడవ వారంలోగా నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందన్నారు. ఇందుకు సంబంధించిన విధులను ఎన్నికల కమిషన్ వేగవంతం చేసిందన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. అనంతరం రాష్ట్ర వైసిపి అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి స్వగృహంలో విడిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జనవరి 19న రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహావిష్కరణ విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అట్టహాసంగా జరుగుతుందన్నారు. 2014-19 చంద్రబాబు హయాంలో విజయవాడలో దళితులకు అద్దెకు ఇళ్లు దొరకని పరిస్థితి అన్నారు. జగన్ హయాంలో అంబేద్కర్ విగ్రహం విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేస్తుండడం దళితులకు దక్కిన సామాజిక న్యాయానికి అద్దం పడుతోందన్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు హాజరవుతున్నారని తెలిపారు. ప్రొద్దుటూరు నుండి అయిదు బస్సుల్లో 250 మంది ప్రజలు హాజరవుతున్నారని తెలిపారు. అంతేకాక సొంత వాహనాల్లో బయలు దేరుతున్నారన్నారు. సమావేశంలో వైసిపి, దళితసంఘ నేతలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు

పనులు వేగవంతం చేయాలి : ఎమ్మెల్యే


అధికారులు, నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

మండలంలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో బుధవారం ఆయన అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చాపాడు చర్చి పనులకు రూ.12 లక్షలు, బద్రిపల్లె చర్చి నిర్మాణ పనులకు రూ.6 లక్షలు ఎంపీ నిధుల ద్వారా మంజూరు చేయించామన్నారు. అల్లాడుపల్లె రైతు సేవా సహకార సంఘం బ్యాంకు ఆవరణలో ఉన్న స్థలంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూ రయ్యాయని, నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి ధనుంజయ బాబుకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న నూతన హైస్కూల్ భవనాల పనులను వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి లక్షుమయ్య, జడ్పిటిసి భర్త శాంతరాజు, పంచాయతీరాజ్ ఎఇ ఈశ్వరయ్య, సొసైటీ సిఇఒ జాన్, నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనం ప్రారంభం

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద నూతనంగా నిర్మించిన వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, ఆప్కో ఛైర్ పర్సన్ మల్లెల ఝాన్సీ, సోమిరెడ్డిపల్లి సహకార పరపతి సంఘం ఛైర్మన్ నేలటూరి సుబ్బారెడ్డి ప్రారంభించారు. మండలంలోని రైతులు పరపతి సంఘం ద్వారా అన్ని బ్యాంకుల కంటే తక్కువ వడ్డీకే పంట రుణాలు, బంగారు, వాహన రుణాలు అందుబాటులో ఉంటాయని వక్తలు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. సొంత భవనం ఏర్పాటు చేసుకోవడంపై ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లి నాగిరెడ్డి, ఎంపిపి వీరనారాయణ రెడ్డి, జడ్పీటిసి రామ గోవిందరెడ్డి, చౌదరవారిపల్లి సర్పంచ్ ఓబుల్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, ఉమాపతి, పాల రామిరెడ్డి పాల్గొన్నారు.

బ్రెయిలీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వినతి

పులివెందుల రూరల్ : చూపులేని వారి జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయా బ్రెయిలీ విగ్రహాన్ని పులివెందుల పట్టణంలోని ఓ ప్రధాన కూడలిలో ఏర్పాటు చేయాలని ఎపి విభిన్నప్రతిభావంతుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి కోరారు. ఆ మేరకు బుధవారం ఆయన ఆధ్వర్యంలో విభిన్నప్రతిభావంతులు మున్సిపల్ ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్‌రెడ్డికి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులివెందుల మోడల్ సిటీ తరహాలో రోడ్ల విస్తరణ కార్యక్రమాలు, కొత్త సర్కిళ్ల ఏర్పాటు చేస్తున్నందున ఏదైనా ఒక కూడలిలో స్ఫూర్తి ప్రదాత లూయా బ్రెయిలీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే, భావితరాలకు ఆయన అంధులకు చేసిన సేవలు అందుతాయన్నారు. పులివెందుల పట్టణంలో ఏర్పాటు చేస్తే లూయా బ్రెయిలీ విగ్రహం రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన వైయస్ మనోహర్‌రెడ్డి ప్రభుత్వానికి నివేదిక పంపి తప్పకుండా త్వరలో పట్టణంలోని ఒక కూడలిలో బ్రెయిలీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎపి విభిన్నప్రతిభావంతుల నెట్‌వర్క్ కార్యదర్శి ఆర్.వెంకటసుబ్బయ్య, సంయుక్త కార్యదర్శి సునీల్, కార్యవర్గ సభ్యులు చంద్రఓబులరెడ్డి, బాబు, సిద్ధారెడ్డి పాల్గొన్నారు.


మనోహర్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందిస్తున్న రఘునాథరెడ్డి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

చంద్రబాబు సభకు తరలిరండి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కమలాపురం నియోజకవర్గంలో శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరగనున్న రా కదలి రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రొద్దుటూరు నుండి 7,000 మందితో తాను హాజరవుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. ఆమేరకు బుధవారం స్థానిక అభ్యాస్ జూనియర్ కళాశాలలో వరదరాజులరెడ్డి పలువురు టిడిపి నాయకులు, అభిమానులు, ముఖ్య కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి, వారి అభిప్రాయాలను తీసుకొని చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు రాష్ట్రాభివృద్ధికి పాటుపడే వ్యక్తి అన్నారు. టిడిపిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని కార్యకర్తలకు సూచించారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రాన్ని వందేళ్లు వెనక్కి తీసుకెళ్లిందని తెలిపారు. మరోసారి గెలిస్తే రాష్ట్రం సర్వనాశనమైతుందన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, పలువురు మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, గ్రామ, వార్డుస్థాయి నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని జమ్మలమడుగు నియోజకవర్గ పరిశీలకుడు మద్దూరు రామకృష్ణ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మండల టిడిపి నాయకులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా దిగిపోయే సమయానికి రూ.3.56 లక్షల కోట్లు అప్పు ఉండేదని, వైసిపి ప్రభుత్వంలో రూ.13 లక్షల కోట్లకు చేరిందన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సైకో పోవాలి సైకిల్ రావాలి అని కోరుకుంటున్నారని తెలిపారు. చంద్రబాబు శుక్రవారం కమలాపురంలో నిర్వహిస్తున్న రా కదలిరా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పరిశీలకులు గాజుల ఆదెన్న, మండల ఇన్‌ఛార్జి జయరామిరెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు మోహన్‌రెడ్డి, రమేష్ రెడ్డి, దాసరి రాజారెడ్డి, శివారెడ్డి, అంకాల్ రెడ్డి, నాగేశ్వరరావు, రమేష్ నాయుడు, సేట్, సంజీవరెడ్డి, బాషా, దానం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముద్దనూరు: టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు శుక్రవారం కమలాపురంలో నిర్వహించే సభను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామం నుండి నాయకులు, కార్యకర్తలు సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. మండలశాఖ అధ్యక్షులు శివరామిరెడ్డి, పట్టణ అధ్యక్షులు రంగారెడ్డి, మైనార్టీ నాయకులు అబ్దుల్ ఖాదర్, ఖాధర్ ఖాన్, రాజశేఖర్ యాదవ్, శేఖర్ నాయుడు, కేశవరెడ్డి,జదగీశ్వర్ రెడ్డి, రామ సుబ్బారెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

టిడిపి జెండా ఎగరడం ఖాయం : భూపేష్‌రెడ్డి

ప్రజాశక్తి - పెద్దముడియం

రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో టిడిపి జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ జమ్మలమడుగు ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. మండలంలోని పాలూరు గ్రామంలో భూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం 60 కుటుంబాలు టిడిపిలో చేరాయి. వీరికి ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కుమ్మరి రమణ, వెంకటేష్, నాగేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, బోయ సుబ్బరాయుడు, నల్లబోతుల గురప్ప, పుల్లయ్య, బాల పెద్దన్న, రామలక్ష్మయ్య, నారాయణ, ప్రతాప్, శ్రీను, బాల మునయ్య, చిన్న పుల్లయ్య, శ్రీనివాసులరెడ్డి, రామిరెడ్డి, వెంకటరమణ, రామన్న, కదిరి లక్ష్మన్న, జంగం బ్రహ్మయ్య, రమణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితర కుటుంబాలున్నాయి. అనంతరం భూపేష్‌రెడ్డి బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, దేవగుడి యూత్, బాల సుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, పుసులూరు రామిరెడ్డి, హుస్సేన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, బాబుల్‌రెడ్డి, బ్రహ్మయ్య, సుధాకర్, శ్రీను, నాగార్జునరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కుమారస్వామి రెడ్డి, పోరెడ్డి భాస్కర్ రెడ్డి, జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, దేవగుడి కుటుంబ అభిమానులు పాల్గొన్నారు.

టిడిపిలో 45 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మున్సిపాలిటీ పరిధిలోని దిగువపట్నం కాలనీలో 45 కుటుంబాలను తెలుగుదేశం పార్టీ లో చేరాయి. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి భూపేష్ సుబ్బరామిరెడ్డి బుధవారం సాయంత్రం వారికి పార్టీ కండువా వేసి చేర్చుకున్నారు. పార్టీలో చేరినవారిలో బిర్రు సంతోష్, మోహన్, పేతురు, పురుషోత్తం, శ్రీనివాసులు, సత్యం, కనకయ్య, లక్ష్మయ్య, చెన్నయ్య, మోహన్, పురుషోత్తం, చెన్నయ్య, పుల్లయ్య, జయపాల్, మధు, చంద్ర నాయక్, చంద్రమోహన్, రవి వర్మ, క్రిస్టఫర్, దేవి, భారతి, సునీత, బుజ్జి, తదితర కుటుంబాలున్నాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శివనాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, నెల్సన్ కుమార్, ఫిలిప్, జయచంద్ర, దువ్వూరు మురళి, జక్కల విశ్వం పాల్గొన్నారు.

రాజకీయ మహాప్రస్థానాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్ల స్థానాలతోపాటు జనరల్ స్థానాల్లో దళితులకు ప్రాతినిధ్యం కల్పించే అంశంపై ఎపి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 20న విజయవాడలోని గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో మాదిగ, ఉపకులాల రాజకీయ మహాప్రస్థానం సమావేశాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మార్పీఎస్ కార్యాలయం వద్ద బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర చర్మడప్పు కళాకారుల సంఘం అధ్యక్షులు నాగభూషణం, విద్యార్థి విభాగం జమ్మలమడుగు నియోజకవర్గ అధ్యక్షులు కొమ్ము రఘురాముడు, ఎర్రగుంట మండల అధ్యక్షులు రామాంజనేయులు, జిల్లా సహాయ కార్యదర్శి ఈశ్వరయ్య, చంద్రఓబులేసు, మాతయ్య, సుబ్బయ్య, గంగాధర్, వెంకటేష్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రెండు బైకులు స్వాధీనం : ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని కడప నాగయ్యపల్లె గ్రామంలో ఈనెల 11న జరిగిన బైక్ చోరీలో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రోషన్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్లో విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 11, 13వ తేదీల్లో కడప నాగయ్య పల్లె, అగ్రహారం గ్రామాల్లో టీవీఎస్ ఎక్సెల్ ఏపీ 04బివై 6284, ఏపీ 39 సిఎ 6283 బైకులను రైతులు తమ పొలాల వద్ద ఉంచగా చోరీకి గురయ్యాయి. ఇందుకు సంబంధించి తమకందిన సమాచారం మేరకు ఆంజనేయులు, రాము అనే వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. తమ పొలాల వద్ద ఉంచిన వాహనాలకు తప్పనిసరిగా సైడ్ లాక్ వేసుకోవాలని ఎస్ఐ రైతులకు సూచించారు.

జూదరులు అరెస్టు : నగదు స్వాధీనం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక పంచాయతీ పరిధిలోని చింతలమడుగుపల్లె క్రాస్‌లో జూదం ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు సిఐ చాంద్‌బాషా తెలిపారు. బుధవారం వేంపల్లెకు చెందిన కొంతమంది జూదం ఆడుతున్న సమాచారం రావడంతో సిఐ ఆదేశాల మేరకు ఎస్ఐ తిరుపాల్ నాయక్ సిబ్బందితో దాడులు చేశారు. జూదరులతోపాటు రూ.5500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.